## రాబడి

# ఎస్బీఐ వుయ్‌కేర్ ఎఫ్‌డీ

### సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక స్కీం

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ)ను అందిస్తున్నది. ఎస్బీఐ వుయ్‌కేర్ పేరుతో వచ్చిన ఈ ఎఫ్‌డీ కాలపరిమితి 5-10 ఏండ్లుగా ఉన్నది. కొత్త డిపాజిట్లతోపాటు కాలపరిమితి తీరిన పాత డిపాజిట్ల రెన్యువల్‌కూ ఈ స్కీం అందుబాటులో ఉంటుంది. ఇందులో చేరేందుకున్న గడువు ఈ నెలాఖరే. ఇతర ఎఫ్‌డీలతో పోల్చితే ఇందులో వడ్డీరేటు ఆకర్షణీయంగా ఉండటం విశేషం. పెద్ద ఎత్తున డిపాజిట్లు చేసేవారికీ ఈ స్కీం అనువుగా ఉండటం మరింత కలిసొచ్చే అంశం. నిజానికి మార్కెట్ రిస్క్ లేకపోవడం, సురక్షిత పెట్టుబడి సాధనం కూడా కావడంతో ఇటీవలికాలంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ఆదరణ పెరుగుతున్నది.

**రూ.2 కోట్లలోపు డిపాజిట్లపై వృద్ధులకు వడ్డీరేట్లు**

| కాలపరిమితి | వడ్డీరేట్లు |
|---|---|
| 7-45 రోజులు | 4% |
| 46-179 రోజులు | 5.25% |
| 180-210 రోజులు | 6.25% |
| 211 రోజుల నుంచి ఏడాదిలోపు | 6.5% |
| ఏడాది-రెండేండ్లలోపు | 7.3% |
| రెండేండ్లు-మూడేండ్లలోపు | 7.5% |
| మూడేండ్లు-ఐదేండ్లలోపు | 7.25% |
| ఐదేండ్లు-పదేండ్లదాకా | 7.5% |

#### 7.50% వడ్డీరేటు

ఈ ప్రత్యేక ఎఫ్‌డీపై ఎస్బీఐ 7.50 శాతం వడ్డీరేటును చెల్లిస్తున్నది. కాగా, మిగతా ఎఫ్‌డీల విషయానికొస్తే.. ఎస్బీఐ అమృత్ కలశ్ ప్రత్యేక డిపాజిట్ స్కీంలో సీనియర్ సిటిజన్లకు 400 రోజుల కాలపరిమితిపై 7.60 శాతం వడ్డీరేటు వస్తున్నది. దీనిలో చేరేందుకు కూడా గడువు ఈ మార్చి 31 మాత్రమే. ఇక 1111 రోజుల నుంచి 1777 రోజుల గ్రీన్ డిపాజిట్లపై 7.15 శాతం, 2222 రోజుల డిపాజిట్లపై 7.40 శాతం వడ్డీరేటు అందుతున్నది. రెండేండ్ల కాలపరిమితితో ఉన్న ఎస్బీఐ సర్వోత్తమ్ టర్మ్ డిపాజిట్లపై 7.9 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఏడాది డిపాజిట్‌కు మాత్రం 7.60 శాతం వడ్డీరేటు వర్తిస్తున్నది.





# పుత్తడి ధరల్లో తేడాలెందుకో..

బంగారం ధరలు ఏ రోజుకారోజు పెరుగుతూ పోతున్నాయి. కేవలం వారం రోజుల్లోనే తులం ధర దాదాపు రూ.3,000 మేర ఎగిసింది. మరోవైపు పెండ్లిళ్ల సీజన్ నడుస్తున్నది. ధర ఎంతైనా అవసరాలకు ఆభరణాలు కొనడం తప్పనిసరే. కొనడానికి వెళితే ఒకో దుకాణంలో ఒకో ధర చెపుతుంటారు. ఆయా జ్యువెలర్ వెబ్‌సైట్‌ల్లోనూ ధరల్లో తేడాలుంటాయి. అలాగే ప్రచార సాధనాల్లో చూస్తున్న బంగారం ధరకు షాప్‌లో లేదా వెబ్‌సైట్‌లో చూసే ధరకు వ్యత్యాసం కన్పిస్తుంది. దీంతో ఎక్కడ కొనాలి? కొన్న బంగారం స్వచ్ఛత ఎంత? ఏ రేటుకు కొనాలి? తదితర సందేహాలన్నీ ముసిరేస్తాయి. ఆ సందేహాలు తొలగిపోవాలంటే నగల ధరల్ని ఏయే అంశాలు నిర్దేశిస్తాయో తెలుసుకోవాలి. అవి..

#### బంగారం స్వచ్ఛత

బంగారు నగల్ని వివిధ రకాల పుత్తడితో తయారు చేస్తారు. బంగారం స్వచ్ఛతను క్యారెట్‌తో కొలుస్తారు. పూర్తి స్వచ్ఛతతో (24 క్యారెట్) కూడిన బంగారం సున్నితంగా ఉంటుంది. అందుచేత నగగా మలచడానికి మరో లోహాన్ని అందులో కలుపుతారు. దీనితో ఆభరణాల బంగారంలో స్వచ్ఛత కొంత తగ్గుతుంది. సాధారణంగా 22 క్యారెట్ బంగారాన్ని నగల తయారీలో ఉపయోగిస్తారు. 22 క్యారెట్ అంటే ఆ నగల్లో 91.6 శాతం బంగారం ఉంటుందన్న మాట. 18 క్యారెట్, 14 క్యారెట్ బంగారు నగలు సైతం లభిస్తాయి. 22 క్యారెట్ బంగారానికంటే వీటిలో ఉండే బంగారం స్వచ్ఛత మరింత తక్కువ ఉంటుంది.

#### హాల్ మార్కింగ్

మనం కొన్న ఆభరణాల్లో ఉన్న బంగారం స్వచ్ఛతను ధృవీకరించేదే హాల్ మార్కింగ్. ఈ ప్రక్రియను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిర్వహించి, నగలో ఉన్న స్వచ్ఛతను సర్టిఫై చేస్తుంది. అరు అంకెలు కలిగిన అల్ఫాన్యూమరిక్ హెచ్‌యూఐడీ కోడ్ లేకుండా జువెల్లర్ బంగారం అమ్మడం నిషిద్ధం. ఈ నిబంధన 2023 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది.

#### మూడు ప్రధాన అంశాలు

ఆభరణ వ్యాపారులు ముఖ్యంగా మూడు అంశాల ఆధారంగా బంగారు నగల ధరను నిర్ణయిస్తారు.అవి:

1. ఆభరణాల బంగారం..అంటే 22 క్యారెట్, 18 క్యారెట్, 14 క్యారెట్
2. ఆభరణంలో వాడే బంగారంతో కలిపే లోహం..అంటే వెండి, రాగి, టైటానియం, ఐరెన్, జింక్. సాధారణంగా రాగిని వాడుతారు.
3. ఆయా నగ తయారీకి అయ్యే వ్యయం. డిజైన్‌నుబట్టి వ్యయం లో మార్పులుంటాయి. ఎందుకంటే ప్రతీ నగకూ కటింగ్, పాలిషింగ్‌కు వేరు వేరు విధానాల్ని అవలంబిస్తారు. అంతకంటే ముఖ్యంగా ఆ డిజైన్ యంత్రం ద్వారా రూపొందించబడిందా? లేక హస్తకళా నైపుణ్యంతో రూపుదిద్దుకుందా అనే అంశాల ఆధారంగా తయారీ చార్జీలు ఉంటాయి.

**దేశంలో ప్రముఖ బ్రాండ్ల నగల ధరలు (10 గ్రాములు, 22 క్యారెట్లు)**

| బ్రాండ్ | ధర (రూ.ల్లో) |
|---|---|
| తనిష్క్ | **6,293** |
| మలబార్ | **6,075** |
| జోయాలుక్కాస్ | **6,075** |
| కళ్యాణ్ జువెల్లర్స్ | **6,075** |

*(మార్చి 9న జువెల్లర్స్ వెబ్‌సైట్స్‌లో పొందుపర్చిన ధరలివి)*



# ఈ అలవాట్లతో జాగ్రత్త

*శారీరక దురలవాట్లు ఎంత ప్రమాదమో.. ఆర్థికపరమైన దురలవాట్లూ అంతే ప్రమాదం. ఆర్థిక క్రమశిక్షణ లేక కొందరు, అది ఉన్నప్పటికీ అవగాహన లేక తప్పుడు నిర్ణయాలు తీసుకొని మరికొందరు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకుంటూంటారు. అలాంటివారి కోసం నిపుణులు ఏం చెప్తున్నారో చూద్దాం.*

## వీడకపోతే నష్టం తీవ్రమే

#### తొందరపాటు

ఎలాంటి అవగాహన లేకుండా, విచారణ చేయకుండా తొందరపడి నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం నష్టాలకు దారితీయవచ్చు. స్టాక్ మార్కెట్లపై విశ్లేషణ చేసి, పూర్తిగా రిసెర్చ్ చేశాకే ఓ నిర్ణయానికి రావడం ఉత్తమం. ఇక ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచుకోవడానికి అసలు సమయమే లేని చిన్న మదుపరులు ఈ పెట్టుబడులకు దూరంగా ఉండటమే లాభదాయకం. అయితే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు దిగడం ఒకింత తెలివైన పనేనని నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ మీకొచ్చే ఆదాయం మార్కెట్ ఒడుదొడుకులకు లోబడే ఉంటుందన్నది మరువద్దు. మొత్తానికి ఇతరులు పెట్టారనో.. వారిని అనుసరిద్దామనో కాకుండా ఎక్స్‌పర్ట్స్ సలహాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం.

#### అతితో అనర్థాలే..

కొందరు ఏం చేసినా అపరిమిత స్థాయిలోనే ఉంటుంది. ఈ క్రమంలోనే విపరీతంగా స్టాక్స్‌ను కొంటూంటారు. అలాగే ఫండ్స్‌నూ అదేస్థాయిలో రకరకాల పెట్టుబడి సాధనాల్లోకి మళ్లిస్తూ ఉంటారు. అయితే వైవిధ్యం అనేది వ్యూహమే అయినా.. ఒక మోతాదు దాటితే దుష్పరిణామాలకే దారితీస్తుంది. మీ పోర్ట్‌ఫోలియోలో వివిధ రంగాల నుంచి 15-20 శాతం స్టాక్స్.. మీ పోర్ట్‌ఫోలియో రిస్కును తగ్గిస్తుంది. అయితే ఇంతకు మించితే ఎటువంటి లాభమూ దక్కదు. కాబట్టి స్టాక్స్ కొనుగోలు, నిధుల మళ్లింపుల్లో అతి పనికిరాదు.

#### పొదుపుపై అశ్రద్ధ

పొదుపును ఎప్పుడూ అశ్రద్ధ చేయవద్దు. ప్రతీ వ్యక్తికి ఉండాల్సిన ఆర్థిక క్రమశిక్షణలో తెలివైన పెట్టుబడులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. పొదికైన పొదుపునకూ అంతే స్థానం ఉంటుంది. యుక్త వయస్సు నుంచే సేవింగ్స్‌ను అలవాటు చేసుకుంటే ఆకర్షణీయ లాభాలను పొందవచ్చు. ముఖ్యంగా అనుకోని ఖర్చులను తేలిగ్గా అధిగమించవచ్చు. ఇక నేటి యువతలో చాలామందికి కెరియర్ ప్రారంభంలోనే మంచి ఉద్యోగాలు, పెద్ద జీతాలు దక్కుతున్నాయి. అయితే క్రెడిట్ కార్డులు, ఖరీదైన మొబైల్ ఫోన్లు.. ఇలా లైఫ్‌ను ఎంజాయ్ చేయడంపైనే దృష్టి పెడుతున్నారు వీరంతా. కానీ అత్యవసర పరిస్థితుల కోసం సేవింగ్స్‌పై మాత్రం మొగ్గు చూపడం లేదు. కనుక పొదుపుపై నిర్లక్ష్య ధోరణి వీడాలి.

#### పన్ను కోణంలో చూడొద్దు

ప్రతీది పన్ను కోణంలో చూడవద్దు. పెట్టుబడులైనా, బీమా అయినా పన్ను మినహాయింపులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా బీమా పాలసీల విషయంలో ఈ రకమైన ఆలోచన శ్రేయస్కరం కాదు. ఎందుకంటే పన్ను మినహాయింపుల కోసం బీమా పాలసీలను తీసుకుంటే.. కావాల్సిన ప్రయోజనాలను మీరు కోల్పోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు అవసరమైన బీమాలో భాగంగానే పన్ను ప్రయోజనాలు దక్కాలిగానీ.. మొత్తం పాలసీనే నిరుపయోగంగా మార్చవద్దని హితవు పలుకుతున్నారు. అలాగే సమగ్రరీతిలో కవరేజీ ఉన్న పాలసీలనే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఒకటికి మించి బీమా పాలసీలుంటే మంచిదే అయినప్పటికీ.. మీమీ ఆర్థిక అనుకూలతలనూ పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

#### రుణ భారం

అవసరమున్నా, లేకున్నా నేడు చాలామంది మితిమీరిన రుణ భారాన్ని తలకెత్తుకుంటున్నారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థల నుంచి వస్తున్న ఆఫర్లతో కొందరు.. క్రెడిట్ కార్డు సంస్థల నుంచి వస్తున్న ప్రకటనలతో మరికొందరు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీని వల్ల జీవితంలో రాజీపడి బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. కాబట్టి అప్పు చేసి పప్పుకూడు ఎప్పటికీ మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆదాయ-వ్యయాల మధ్య అంతరాలను తెలుసుకొని జీవించాలంటున్నారు. అనవసరపు కోర్కెలను తీర్చుకోవడానికి చేసే అప్పులు.. మున్ముందు గృహ రుణం వంటి కీలక లక్ష్యాల సాధనను ఆటంకపర్చే వీలుకూడా లేకపోలేదు. కాబట్టి అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

#### చివరగా..

ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక స్థోమతను తెలుసుకొని ప్రవర్తించాలి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లో స్థిరత్వం లోపించింది. ఉద్యోగాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్టుగా ఆదాయం ఉన్నప్పుడే అత్యవసర నిధిని కూడా సిద్ధం చేసుకోవాలి. కనీసం 6 నెలల అవసరాలు తీరేలా ఈ నిధి ఉండాలి. సురక్షితమైన పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే.. పొదుపునకూ ప్రాధాన్యత ఇవ్వాలి. వీలుంటే రుణ భారాన్ని తగ్గించుకోవాలి. అవసరం మేరకే ఖర్చులుండాలన్నది గుర్తుంచుకోండి. విస్తృత శ్రేణి ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను తీసుకోండి. అడ్డగోలు రాబడులనిచ్చే మోసపూరిత స్కీములకు దూరంగా ఉండండి. తొందరపాటుతో కాకుండా ఓ ప్రణాళికతో ముందుకెళ్తే విజయాలు సొంతమవుతాయి.




